క్లుప్తంగా

మక్కా మదీనా యాత్రకు బయలుదేరిన ముస్లింలు


మదీనా యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులు

బేతంచెర్ల: పట్టణానికి చెందిన ముస్లింలు మక్కా మదీనా యాత్రకు మంగళవారం బయలుదేరారు. మండల ఖాజీ నూర్ అహ్మద్‌తో పాటు పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు ఖాజ, పిట్టల సుభాన్, బషీర్, ఇదుర్ సాహెబ్ మరో 29 పాటు పురుషులు, మహిళలు వెళ్లారు. వీరికి ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరక్టర్ మూర్తుజావలి, మాజీ వార్డు సభ్యుడు ఖాజా తదితరలు విడ్కోలు పలికారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కోవెలకుంట్ల: గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్లు విద్యాసాగర్, మహబూబ్ సుభానీ సూచించారు. మంగళవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీఎంఎస్ఎంఏ పథకం కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

బేతంచెర్ల: మండల కేంద్రంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

11న ముగ్గుల పోటీలు

బేతంచెర్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 11న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామేశ్వర్‌రెడ్డి,శ్రీధర్ తెలిపారు. దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామన్నారు.

11న ముగ్గులు, ఆటల పోటీలు

డోన్ టౌన్ : సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకొని ఈ నెల 11వ తేదీ ఉదయం 9గంటల నుంచి పట్టణంలోని 21వ వార్డులోని 5 నుంచి 20 సంవత్సరాల బాల బాలికలకు, 5 నుంచి 16 సంవత్సరాల బాలురకు ఫోటాన్ ఇన్సిట్యూట్ వద్ద టీ స్పూన్, నిమ్మకాయ, మ్యూజికల్ బాల్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వార్డు కౌన్సిలర్ షాధిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తామన్నారు. 12వ తేదీన మహిళలకు ముగ్గుల పోటీలు మధ్యాహ్నం 3గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు రూ.4వేలు, 3వేలు, 2వేలు చొప్పున బహుమతులు ఇస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు బుధవారం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పోటీలు కేవలం 21వ వార్డు వారికి మాత్రమే అని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డోన్ విద్యార్థులు

డోన్ టౌన్ : జిల్లా కేంద్రం నంద్యాలలోని గుడ్ షెపర్డ్ పాఠశాల్లో ఈ నెల 7న జరిగిన జిల్లా స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ పోటీల్లో శ్రీసుధ స్కూల్ విద్యార్థులు అనుశ్రీ, కీర్తిరెడ్డి ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 12,13వ తేదీల్లో కడప జిల్లా, రాజంపేటలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు నజీర్‌బాషా, మహబూబ్ బాషా, శివ, ప్రశాంతి, సురేష్, శ్రావణిలను వైస్ ప్రిన్స్‌పాల్ పరంరంజన్, ఒలంపియాడ్ కో ఆర్డినేటర్ పెద్దయ్య అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


హారతులు ఇస్తున్న మహిళలు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు స్వామివారికి హారతి పట్టి మొక్కులు చెల్లించారు. అనంతరం అర్చకులు శ్రీకాంత్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతలు పంపిణీ

బనగానపల్లె రూరల్ : పట్టణంలో విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి గెలగాని ఓబులరెడ్డి ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓబులరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 70 శాతం ఇళ్లకు అయోధ్య అక్షింతలు పంపిణీ చేశామన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యం
- భూమిలేని నిరుపేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మహిళలకు భూ పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


మహిళకు భూ పట్టాను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

సంజామల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. భూమిలేని నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, పేద మహిళలను రైతులను చేస్తుందన్నారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అదేవిధంగా మజీద్ ఏరియా, పాత బస్టాండ్ సమీపంలో దాదాపు రూ.65 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం పాత బస్టాండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మహిళలకు భూ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబుల రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్న బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ అందనం శృతి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తదితరులతో కలసి పేద మహిళలకు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ భూ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి వారు ప్రసగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యతనిస్తుందన్నారు. మహిళలను రాజకీయంగా ప్రోత్సహించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి పథకం మహిళల పేరున అందజేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందన్నారు. బనగానపల్లెను అన్నివిధాలుగా తాము అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేని టీడీపీ నాయకులు అసత్యారోపణలు చేస్తున్నారన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. అర్హులందరికీ న్యాయం చేయగలిగినందునే ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్తున్నామని, లబ్ధిదారుల సమక్షంలోనే వారికి ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని గుర్తు చేశారు. గ్రామంలో దాదాపు రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు, రూ.36 కోట్లు వివిధ సంక్షేమ పథకాల రూపంలో నేరుగా ప్రజల ఖాతలో జమ అయిందని వివరించారు. సమస్యలను అడిగి పరిష్కారం చూపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరో మారు ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ ప్రజలను కోరారు. అంతకుముందు నరసింహస్వామిని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, లింగిల్‌విండో అధ్యక్షుడు రహమతుల్లా, రామిరెడ్డి పల్లె సర్పంచ్ సోమసుందర్ రెడ్డి, లక్ష్మినారాయణ, రమణ రెడ్డి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

'బాబుకు' గ్యారెంటీ లేదు... బీసీకి వారంటీ లేదు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని, అసత్యారోపణలకు పాల్పడుతూ విషం చిమ్ముతున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధ్వజమెత్తారు. బనగానపల్లె నియోజకవర్గాన్ని అంకితభావంతో అన్ని విధాలు అభివృద్ధి చేస్తుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి వచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. మండల కేంద్రాలతోపాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని, అయితే బీసీకి మాత్రం కనిపించడం లేదన్నారు. అర్హుందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని, ఆసుపత్రులను తీర్చిదిద్దామని గుర్తు చేశారు. అదేవిధంగా పేదలకు భూములు పంపిణీ చేసి మహిళలను రైతులను చేస్తున్నామన్నారు. బనగానపట్టణంలో పేదలకు ఇంటి పట్టాల పంపిణీని, కొలిమిగుండ్లలో భూ పంపిణీని కోర్టు సేల్టతో అడ్డుకున్న ప్రభుద్దుడు బీసీ అని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న బీసీ ఐదేళ్లలో ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీస్తుండడంతో బీసీ కుట్రలకు తెరలేపారని, ప్రజలు అన్నివిషయాలు గమనిస్తున్నారన్నారు. ప్రజలను ఏదోవిధంగా మభ్య పెట్టాలనుకునే బాబుకు గ్యారెంటీ లేదని, పేదల అభివృద్ధిని అడ్డుకునే బీసీకి వారంటీ లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని ఎద్దేవా చేశారు.

నెలాఖరులోపు అందుబాటులోకి మార్కెట్

డోన్ : పట్టణ నడిబొడ్డున రూ.16కోట్లతో చేపట్టిన కూరగాయల మార్కెట్‌ను ఈ నెలాఖరులోపు ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత కూరగాయల మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించే వారితోపాటు చుట్టుపక్కల షాపులకు సంబంధించి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. పది రోజులలో వీరందరికీ కొత్త మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు షాపులు కేటాయించడం జరుగుతుందన్నారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పాత వారికి షాపులు కేటాయించాకా మిగిలిన వాటిని బహిరంగ వేలం పాట ద్వారా వ్యాపారులకు అప్పగించడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో మున్సిపల్ డీఈ రసూల్, ఏఈలు సురేష్, సతీష్, ఆర్‌ఓ మధు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు

డోన్ టౌన్ : సంక్రాంతి పర్వ దినం పురస్కరించుకొని ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు హైదరాబాద్ – డోన్‌కు సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఒక ఎక్స్ ప్రెస్ రాత్రి 9గంటలకు, మరో సూపర్ లగ్జరీ రాత్రి 9.45 గంటలకు మియాపూర్ క్రాస్ రోడ్ నుంచి, అలాగే సీబీఎస్ బస్ స్టేషన్ నుంచి రాత్రి 10.45గంటలకు, 11.35గంటలకు రెండు ఎక్స్ ప్రెస్ సర్వీసులు ఉంటాయన్నారు. 12,13 తేదీల్లో అదనంగా మరో రెండు ఎక్స్ ప్రెస్ బస్సులు నడుపనున్నట్లు ఆయన తెలిపారు. ముందస్తుగా రానుపోను టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్న వారికి 10శాతం రాయితీ ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'వైఎస్ఆర్ జలకళ' రైతులకు వరం

బనగానపల్లె రూరల్ : వైఎస్ఆర్ జలకళ పథకం చిన్నసన్నకారు రైతులకు వరంలాంటిందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో డోన్, కోవెలకుంట్ల క్లస్టర్ ఏపీడీలు సాంబశివరావు, శ్రీవిద్యల ఆధ్వర్యంలో బనగానపల్లె, అవుకు మండలాలకు చెందిన 103 మంది వైఎస్ఆర్ జలకళ లబ్ధిదారులకు ఉచితంగా మోటార్, పైపులు, కేబుల్, స్టార్టర్ బాక్స్ తదితర మొత్తం రూ.1.95లక్షల విలువ పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని మాటాల్డారు. గత టీడీపీ పాలనలో రైతులు తమ సొంత పెట్టుబడితో బోర్లు వేయించుకున్నా విద్యుత్ కనెక్షన్ కోసం రెండేళ్ల వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి రైతుకు వైఎస్ఆర్ జలకళ పథకం కింద ఉచిత బోరుతో పాటు మోటార్, విద్యుత్ కనెక్షన్ కూడా వెంటనే ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం రైతులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గజమాలతో సత్కరించారు. తదనంతరం ఆయా గ్రామాలకు జలకళ పరికరాల ను తరలిస్తున్న వాహనలను ఎమ్మెల్యే జెండా ఊపి పంపారు. కార్యక్రమంలో ఏపీఓ హరికృష్ణ, టీఏ సాధిక్‌వలి, ఎన్ఆర్‌జీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముక్కమల్ల పుల్లారెడ్డి, అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి ఎంపీపీ మానసవీణ, పసుపల సర్పంచ్ మోహన్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాధవరెడ్డి, పాపన్న ,వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌నాయక్ గడ్డం వెంకటేశ్వరరెడ్డి, చిన్నప్పు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వంతెన నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న అర్చకుడు, ప్రజాప్రతినిధులు

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల– భీమునిపాడు గ్రామాల మధ్య ఉన్న కుందరవాగు వంతెన నిర్మాణానికి మంగళవారం ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో వంతెన నిర్మాణానికి రూ. 45 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సర్పంచ్ సోముల లోకేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. రెండు నెలల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని కాంట్రాక్టర్, వెలగటూరు సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాముల అబ్రహం, వెంకటరామిరెడ్డి, రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వరయ్య, మనోజ్, పరమేశ్వరరెడ్డి, హసన్, మహేశ్వరయ్య, పెద్దరామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి

ప్యాపిలి: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తల్లిదండ్రులు కంటున్న కలలను నిజం చేసేందుకు ఇష్టంగా చదువాలని హుసేనాపురం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు పోకల సుబ్బారెడ్డి సూచించారు. మండల పరిధిలోని హుసేనాపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం అన్వర్‌బాషా అధ్యక్షతన విద్యార్థులకు ప్రేరణాత్మక సభ నిర్వహించారు. పోకల సుబ్బారెడ్డి పలు విషయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు స్మార్టు ఫోన్లతో ఎక్కువ సమయం గడుపుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. తమ పిల్లలు స్మార్టు ఫోన్ వాడే సమయంలో తప్పనిసరిగా తల్లిదండ్రులు పక్కనే ఉంటూ గమనిస్తుండాలని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హోసా అధ్యక్షుడు సుదర్శన్, వ్యవస్థాపకులు నాగభూషణం రెడ్డి, పూర్వ విద్యార్థులు శ్రీనివాసరాజు, శివశంకరయ్య, సాహితీవేత్త సురేశ్‌బాబు, ఉపాధ్యాయులు చంద్రమౌళి, అంజనప్ప, సర్వజ్ఞమూర్తి, గోపాల్, దివాకర్, చార్లెస్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన


బేతంచెర్ల : హెల్త్ క్యాంప్‌లో పేర్లు నమోదు చేయించుకుంటున్న ప్రజలు


అవుకు: వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డాక్టర్

బేతంచెర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని సిమెంట్ నగర్‌లో ఎంపీడీఓ వెంగన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆశయ్య, రాజేష్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైస్ ఎంపీపీ రంగస్వామి, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, సర్పంచ్ ఏస్తేరమ్మ, ఎంపీడీఓ వెంగన్న హెల్త్ క్యాంప్‌ను సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్లు మోహతాబేగం, భార్గవి, వంశీ కృష్ణ, వెంకటేశ్వర్లు, రమణ మూర్తి రోగులను పరీక్షించి ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు, కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీలు శాంతి, ఇందిర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు గూని నాగరాజు, యకోబ్, మహేష్, కాశీమ్ పీరా, జాకబ్, దాసు, మౌలాలీ పాల్గొన్నారు.

అవుకు: మండల పరిధిలోని రామాపురం రెండవ గ్రామ సచివాలయ పరిధిలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జనరల్ సర్జన్ లోకేష్, ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు మౌనిక, ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యురాలు యమునాలు 400 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సువార్తమ్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లిలో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సర్పంచ్ వైవిద్య హెల్త్ క్యాంప్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చిన్న మల్కాపురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చెన్నకేశవులు, కొత్తబురుజు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రాంభూపాల్, వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని పాతపాడు గ్రామ సచివాలయం ఆవరణలో మంగళవారం ఎంపీడీఓ శివరామయ్య, టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్లు 511 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా ఆఫీసర్ డాక్టర్ కామేశ్వరుడు, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి హెల్త్ క్యాంప్‌ను తనిఖీ చేశారు. ప్రజలతో మాట్లాడి అందుతున్న వైద్య సేలపై వారు ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, డాక్టర్ రాజేష్, పంచాయతీ కార్యదర్శులు వేదవతి, శకుంతల వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డోన్ : మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం


బనగానపల్లె : ఆరోగ్య పరీక్షలు చేస్తున్న శివశంకరుడు

రాష్ట్రంలో జనరంజక పాలన

- కేక్ కట్ చేసిన జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


కొలిమిగుండ్ల : వైఎస్సార్‌సీపీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: గతంలో ఎన్నడూ లేనిరీతిలో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జనరంజక పాలన సాగుతుందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కొనియాడారు. ప్రజా సంకల్ప పాదయాత్ర ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వివిధ గ్రామాల నాయకులతో కలిసి జెడ్పీ చైర్మన్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికిపైగా సాగిన పాదయాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తిరిగే సమయంలో దారి పొడవునా ప్రజల కష్టాలు, సమస్యలు స్వయంగా విని అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని జగనన్న నేరవేర్చారని చెప్పారు. పాదయాత్రలో ప్రజల కష్టాలే మేనిఫెస్టోలో రూపొందించి అమలు చేశారన్నారు. ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకునేలా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిలో ప్రతి పల్లె దూసుకుపోతుందన్నారు. ఈనాలుగున్నరేళ్లలో ప్రతి గ్రామంలో కళ్లకు కట్టినట్లుగా అభివృద్ధి పనులు దర్శనమిస్తాయన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు 600 అబద్దపు హామీలు ఇచ్చి ఏఒక్కటి పూర్తిగా నెరవేర్చక మధ్యలోనే ఆపేశారని విమర్శించారు. రైతులు, డ్వాక్రా మహిళలు, నిరుద్యోగ యువత... ఇలా అన్ని వర్గాల వారిని చంద్రబాబు నమ్మించి మోసం చేశారన్నారు. రెండు ప్రభుత్వాల మధ్య పరిపాలన బేరీజు వేసుకుంటే చాలా వ్యతాసం కనిపిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతిళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు ఇచ్చి సొంతింటి కలను నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి జరిగేలా పాలన అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, నందిపాడు, నాగిశెట్టిపల్లె సర్పంచ్‌లు గుర్విరెడ్డి, ఈశ్వరయ్య, బెలుం ఉప సర్పంచ్ బాచం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి, కామిని తిమ్మారెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య, మబ్బు శివరామసుబ్బారెడ్డి, బాబుజీ, సుబ్బయ్య, సోమశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్ర ఐదు సంవత్సరాలు అయిన సందర్భాన్ని పురష్కరించుకొని మంగళవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, సుమలత సురేష్, కోఆప్షన్ సభ్యులు రఫీతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రంగస్వామి, ముష్టిపల్లె మల్లికార్జున రెడ్డి, సుధాకర్,సోమశేఖర్ తదితరులు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కోట్లవారి పల్లెలో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తూ జనరంజకమైన పాలన అందిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు గూని నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య, సంధాని, హరి, హెన్రీబాబు,బొల్లి మద్దిలేటి, భాస్కర్, నడ్డి శ్రీను, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.


బేతంచెర్ల : కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్


డోన్ : కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదు

ప్యాపిలి: తాము టీడీపీలో చేరినట్లు వచ్చిన వార్తలు అవాస్తవమని చంద్రపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పి. సోమేశ్‌రెడ్డి, ఎస్. హరినాథ్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం చంద్రపల్లిలో జరిగిన బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తాము టీడీపీలో చేరినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలను వారు ఖండించారు. తాము ఇరువురం లారీ డ్రైవర్లుగా పని చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. విధుల నిర్వహణలో భాగంగా సోమవారం ఇరువురం డ్యూటీకి వెళ్లినట్లు వారు తెలిపారు. గ్రామంలో లేని తాము టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరినట్లు టీడీపీ నాయకులు ప్రకటించుకోవడం సిగ్గు చేటని వారు విమర్శించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొలిమిగుండ్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు... భూ రక్ష కార్యక్రమంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ డోనీ ఆల్‌ఫ్రెడ్ సూచించారు. మంగళవారం స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో రైతులతో ఆయన గ్రామ సభ నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన రీసర్వేలో ఏర్పడిన సమస్యలపై రైతులతో చర్చించారు. విస్తీర్ణంలో తేడాలు, ఫొటోలు,పేర్లు మార్పులు తదితర వాటిపై అవగాహన కల్పించి దరఖాస్తులు స్వీకరించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీటీ నాగేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ జ్యోతి, వీఆర్వో భార్గవి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్ పాలనలో పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని సచివాలయం –2 పరిధిలోని బుడగ జంగాల కాలనీ, పెండేకంటినగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, సర్పంచ్ ఈసారి యల్లమ్మ తదితర నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ఆయా కుటుంబాలకు వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు లభించడమే సీఎం వైఎస్ జగన్‌ధ్యేయమన్నారు. అర్హులై ఉండి పథకాలు లభించని వారు నా దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ బనగానపల్లె పట్టణం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు. పట్టణంలో రూ.22 కోట్లతో చేపట్టిన వందపడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. రూ.8కోట్లతో ప్రభుత్వ అతిథి గృహం నుంచి జీఎం టాకీస్ వరకు ఫోర్‌లైన్స్ ఏర్పాటు చేయడంతో పాటు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కూడా కల్పించడం జరిగిందన్నారు. మరో రూ.4 కోట్లతో పెట్రోల్‌బంకు సెంటర్ నుంచి బేతంచర్ల రోడ్డు అభివృద్ధి పనులు కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ,పీఆర్ ఏపీ మహేష్, ఈఓ ఖలీల్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వంగల పరమేశ్వర రెడ్డి, రామచంద్రారెడ్డి, రామారెడ్డి, ప్రసాదరెడ్డి,బుచ్చిరెడ్డి, బండిబ్రహ్మానంద రెడ్డి,కిశోర్, అంబటిరవికుమార్ రెడ్డి, సుదర్శన్, పుల్లయ్య, తిరుపాల్ పెద్దనాగన్న నీలిశివతో పాటు వైఎస్సార్‌సీపీ గృహసారధులు,సచివాలయ ఉద్యోగులు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.